

తొలివెలుగు జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 33 | శనివారం | 2?9-ఆగస్టు -2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:33 | Saturday | 29-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/- |


## 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు, 400 మంది సురక్షితం

- చైనా వైపు చిక్కుకున్న 400 మంది భారతీయులు సురక్షితం
- ఇప్పటివరకు 84 మందిని సురక్షితంగా కాపాడిన అధికారులు
- భారత సంతతికి చెందిన మరో 100 మందితో కూడా తెగిన సంబంధాలు
- ఢిల్లీ, కాఠ్మండు, బీజింగ్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



## వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్..

- 65 బిలియన్ బ్యారెల్ల చమురు నిల్వలు అమెరికా నియంత్రణలోకి
- పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వ కీలక వ్యూహం
- ఈ ఒప్పందంతో అమెరికాలో ఇంధన ధరలు తగ్గుతాయన్న అంచనాలు
- వెనెజువెలాలో 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం



## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా.

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా
- రెండు సంవత్సరాల్లో ఇదే ఆరోపణపై పదవి వీడటం ఇది రెండోసారి
- ప్రెస్ మీట్‌లో తన రాజీనామా ప్రకటిస్తూ కన్నీటిపర్యంతమైన కాంగ్రెస్ నేత
- బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందంటూ నాగేంద్ర ఆరోపణ



2లో

# రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

**భార్య, కుమార్తెకి బొట్టు పెట్టి.. రేవంత్‌తోపాటు ఆయన మనవడికీ రాఖీ**

**ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీ కట్టి ఆశీస్సులు తీసుకున్న మంత్రి**

**ఇద్దరి మధ్య రాజీకి సంకేతమా? పండుగ పూట ఇరువురూ హుందాగా వ్యవహరించారా?**

**తాజా పరిణామాల నేపథ్యంలో 'రక్షా బంధన్'పై ఆసక్తికర చర్చ**

**నాపై ఆయన ఆశీస్సులు ఉంటాయి: మంత్రి సురేఖ**



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి ఈసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లడం, ముఖ్యమంత్రితో పాటు ఆయన మనవడికి బంగారంతో ప్రత్యేకంగా చేయించిన రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకోవడం తాజా రాజకీయ పరిణామాల్లో ఆసక్తికరంగా మారింది. మరో మంత్రి సీతక్కతో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన ఆమె ముఖ్యమంత్రికి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎంతో పాటు ఆయన సతీమణి గీత, కుమార్తె నైమిషాలకు బొట్టు పెట్టి, రేవంత్‌తో పాటు ఆయన మనవడికి కూడా రాఖీ కట్టారు. అయితే, రాఖీ కట్టేందుకు సీఎం నివాసానికి సురేఖ వెళ్లారన్న వార్తతో పాటు రాఖీ కట్టిన సందర్భంలోనూ, ఆ తర్వాత రేవంత్, సురేఖలిద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం, ఎక్కడా ఇద్దరి ముఖకవళికల్లో ఇబ్బంది కనిపించకపోవడంతో అసలేం జరుగుతుందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఈ బంధం ఇలానే కొనసాగుతుందా? లేక బంధానికి త్వరలోనే గండి పడుతుందా? అన్న చర్చ జరిగింది.

- మిగతా 2వ పేజీలో




## నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

- మిగతా 2వ పేజీలో

## ఎవరి జాగీరు అని మీ ఫోటోలు వేసుకుంటున్నారు

- కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల
- సన్న బియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫోటో వేయడం లేదని మండిపాటు
- కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య



## అంబటి రాంబాబుకు అస్వస్థత..

- అస్వస్థతకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు
- హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స
- వైద్య పరీక్షల అనంతరం స్టెంట్ అమర్చిన డాక్టర్లు
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- ఆందోళన వద్దని స్పష్టం చేసిన వైద్యులు



**పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..**

## చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య

"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

- మిగతా 2వ పేజీలో

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు
- జీహెచ్‌ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం



తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

- మిగతా 2వ పేజీలో

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ



## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా..

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర వివాదాస్పదమైన మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి బి. నాగేంద్ర శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటిపర్యంతమయ్యారు. గత రెండేళ్ల కాలంలో ఇదే ఆరోపణలపై ఆయన రాజీనామా చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ కుంభకోణం నేపథ్యాన్ని పరిశీలిస్తే, వాల్మీకి కార్పొరేషన్‌లో సుమారు రూ. 89 కోట్ల మేర నిధులు అక్రమంగా బదిలీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి తన పదవికి రాజీనామా చేశారు. అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత, 2026 ఆగస్టు 3న నాగేంద్రను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో ఆయన మరోసారి పదవిని వీడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నా బీజేపీ ముందుకు రాలేదని విమర్శించారు. బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందని, ఆ పార్టీ 'మనుస్మృతి'ని రుద్దాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్.. ట్రంప్ కీలక ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన ప్రకటన చేశారు. దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాతో చమురు ఒప్పందం కుదిరిందని, దీని ద్వారా ఆ దేశంలోని 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను అమెరికా నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది.

### 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు, 400 మంది సురక్షితం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా 320 మంది భారతీయులతో సంబంధాలు తెగిపోయాయని, వారి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. అయితే, చైనా వైపున చిక్కుకున్న మరో 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ నిన్న మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వరదల బారి నుంచి ఇప్పటివరకు 84 మంది భారతీయులను సురక్షితంగా కాపాడినట్లు ఆయన తెలిపారు. వీరిలో త్రిశూలి-1 హైడ్రోపవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది, తమిళనాడుకు చెందిన మరో 21 మంది ఇండిగో విమానంలో ఢిల్లీకి చేరుకున్నారని పేర్కొన్నారు. చైనా వైపు చిక్కుకున్న వారిలో ఇప్పటికే 96 మంది నేపాల్ సరిహద్దుల్లోకి ప్రవేశించారని, మిగిలిన వారి తరలింపు ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. చైనాలో ఉన్న 400 మంది తమ కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా సంప్రదింపుల్లో ఉన్నారని, వారిని సురక్షితంగా తరలించేందుకు చైనాలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని జైస్వాల్ తెలిపారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. దక్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ౹ా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

# చర్చకు నేను రెడీ

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.ీ్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు. రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు. జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు.

## ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు

తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

## అంబటి రాంబాబుకు అస్వస్థత..

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

# రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవానికి, ప్రతి రాఖీ సందర్భంగా సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ రాఖీ కడుతున్నారు. అయితే, ఇటీవల సురేఖ కుమార్తె సుస్మిత మాట్లాడిన మాటలు, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు సురేఖ, రేవంత్‌ల నడుమ రాజకీయ అగాధాన్ని ఏర్పరిచాయి. అసలు ఎదురుపడితే ఇద్దరూ మాట్లాడుకోగలరా? అనే స్థాయిలో రాజకీయ చర్చోపచర్చలు జరిగాయి. కానీ, రాఖీ పౌర్ణమి రోజున ఇద్దరూ హుందాగా వ్యవహరించి పండుగ ప్రత్యేకతను, సందేశాన్ని ప్రజలకు పంపడం గమనార్హం. అయితే, అసలు సీఎం అపాయింట్‌మెంట్ తీసుకునే సురేఖ వెళ్లారా? కనీసం సమాచారమిచ్చారా? ఒకవేళ నిజంగానే సమాచారం అందిన మేరకు సురేఖతో రాఖీ కట్టించుకునేందుకు సీఎం అమోదించారా? తద్వారా రేవంత్ వర్సెస్ కొండా కుటుంబం అనే వివాదం విషయంలో రాజీ సంకేతాలను పంపాలనుకున్నారా? లేదంటే పండుగ పండుగే... చర్యలు చర్యలే.. అన్న ధోరణిలో ముందుకెళ్లారా? అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. రాఖీ కట్టి సీఎం నివాసం నుంచి వెళ్లిపోయిన మంత్రి సురేఖ తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌కు రాఖీ కట్టి వచ్చానని, ఆయనకు ఆడపడుచులందరి దీవెనలు ఉంటాయని చెప్పారు. ఆయన సుపరిపాలన అందించాలని, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తి, యుక్తి ఆయనకు కలగాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ ఆశీర్వాదం కూడా ఆడపడుచులందరిపై ఉండాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా రాఖీ పండుగ జరుపుకుంటున్న అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ముళ్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ రోజున రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదని, మూడోసారి రేవంత్‌కు రాఖీ కట్టి వచ్చానని చెప్పారు. ఆడపడుచుల విషయంలో సురేఖను వేరు చేసి మాట్లాడవద్దని, గ్రామీణ ప్రాంత మహిళలతో పాటు తనపై కూడా ఆయన ఆశీస్సులు ఉంటాయని సురేఖ వ్యాఖ్యానించారు.

కాగా, రక్షాబంధన్ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసం కిటకిటలాడింది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ అధ్యక్షురాళ్లు మొగిలి సునీత, నేరెళ్ల శారద, వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత, బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, మాజీ ఎంపీ గుండు సుధారాణి, పీసీసీ నేతలు బొజ్జా సంధ్యారెడ్డి, ఇందిరా శోభన్, రేగులపాటి రమ్యారావు, పాల్వాయి రజనీకుమారి తదితరులతో పాటు పలు కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, బ్రహ్మకుమారీలు, మలక్‌పేటలోని గవర్నమెంట్ హైసరీ?కల్ ఫర్ ది బ్లైండ్ గరల్స్ విద్యార్థినులు రేవంత్‌కు రాఖీలు కట్టారు.

### నా ఎదుగుదలలో అండగా రేవంత్: మంత్రి సీతక్క

సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన తర్వాత టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొజ్జా సంధ్యారెడ్డి తదితరులతో కలిసి మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. వామపక్ష భావజాలం నుంచి వచ్?చన ఆదివాసీ బిడ్డగా తన ఎదుగుదలలో రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని, తను ఈ స్థాయికి రావడంలో ఆయన సహకారం చాలా ఉందని చెప్పారు. తనకున్న ఒక్క తోబుట్టువు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని, అక్కా అంటూ తన వద్దకు వచ్?చన వారందరినీ సోదరులుగా భావిస్తానని చెప్పారు.



# సీఎం రేవంత్, మధుయాష్కీ గౌడ్‌కు రాఖీ కట్టిన దాము అనూష

- రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు
- ప్రజాసేవలో పెద్దల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్ష




**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు కాంగ్రెస్ నాయకురాలు దాము అనూష మహేందర్ యాదవ్ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారి ఆశీస్సులు తీసుకుని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, పరస్పర గౌరవానికి రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని దాము అనూష మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాసేవలో తనకు పెద్దల ఆశీస్సులు, మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మధుయాష్కీ గౌడ్ మార్గదర్శకత్వం తనకు ప్రజాసేవలో మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ పవిత్రమైన రాఖీ బంధం ప్రజల కోసం మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేసే శక్తిని అందించాలని కోరుకున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్ దాము అనూష మహేందర్ యాదవ్‌కు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు.

# భక్తి పారవశ్యం.. మద్దెలమ్మ బోనం

- పెద్దకాపర్తిలో ఆధ్యాత్మిక శోభతో మిన్నంటిన ఉత్సవాలు
- అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించిన మహిళలు
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో శ్రీ మద్దెలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ గ్రామదేవత ఉత్సవాల్లో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిప్రపత్తులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన కుండల్లో పవిత్రంగా నైవేద్యాన్ని వండి, వేపాకులు, పసుపు, కుంకుమలతో బోనాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలను నెత్తిన ఎత్తుకుని ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. భక్తి పారవశ్యంతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన మహిళలు, అనంతరం మద్దెలమ్మ తల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని, గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాటం వెంకటేశం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుజ్జరి యాదగిరి, జెల్లా ప్రశాంత్, జెల్లా నరసింహ, వడ్డేపల్లి మురళి, గంజి భాస్కర్, కోట వెంకటేశం తదితరులతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.






రియల్ వ్యాపారుల కోరల్లో మల్లాయి చెరువు..?

# వరుస కథనాలతో కదిలిన అధికార యంత్రాంగం

- మల్లాయి చెరువు ఆక్రమణపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- చెరువు మధ్యలో రోడ్డు నిర్మాణంపై గ్రామస్తుల ఆగ్రహం
- చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పై అధికారుల పరిశీలన
- 'రోడ్డు నిర్మాణంలో తప్పిదం జరిగింది' అని రియల్ ఎస్టేట్ వ్యాపారి అంగీకరించినట్లు సమాచారం
- ఇరిగేషన్ శాఖతో పూర్తిస్థాయి సర్వేకు డిమాండ్
- చెరువును కాపాడాలని రైతులు, గ్రామస్తుల డిమాండ్

TGTEL/26/A6221
తొలివెలుగు ఎఫెక్ట్

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం చెల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని మల్లాయి చెరువు ఆక్రమణ వ్యవహారంపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. గత మూడు రోజులుగా తొలివెలుగు దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాల నేపథ్యంలో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. చెరువు మధ్యలో రహదారి నిర్మాణం, చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్‌జోన్ పరిధిలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న పనులపై అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు.

**క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన:**

చెల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 223, 224లో ఉన్న భూముల పరిస్థితులతో పాటు 15 ఎకరాల 2 గుంటల స్థలానికి సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. చెరువు పరిధి, శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులపై స్పష్టత కోసం సర్వే ప్రక్రియ చేపట్టారు. చెరువు మధ్య భాగంలో రహదారి నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన చెరువు సహజ స్వరూపాన్ని మార్చేలా పనులు జరుగుతున్నాయని, దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**అధికారులకు వివరించిన గ్రామస్తులు:**

సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్ఐ పల్లెపాటి నర్సింలు, ఇరిగేషన్, సర్వేయర్‌లకు గ్రామస్తులు, రైతులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు చెరువు పరిస్థితిని వివరించారు. చెరువు మధ్యలో రోడ్డు నిర్మాణం వల్ల చెరువు సహజ ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

**'రోడ్డు నిర్మాణంలో తప్పిదం జరిగింది'..?**

15 ఎకరాల 2 గుంటల భూమిని కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థానికులతో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా చెరువు మధ్యలో రోడ్డు నిర్మాణం విషయంలో తప్పిదం జరిగిందని అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ అంశంపై సంబంధిత శాఖలు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


తల్లి లాంటి చెరువును మింగేస్తున్నారు..?
- దొంగతనాన్ని అడ్డుకోకపోతే అధోగతేనంటూ ఆందోళన
- రియల్ వ్యాపారుల అకృత్యాలపై సంతకాల సేకరణ
- మల్లాయి చెరువు పరిరక్షణకు రైతులు, గ్రామస్తుల పోరాటం

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని మల్లాయి చెరువు రియల్ వ్యాపారుల కబ్జాకు గురవుతోందంటూ రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కన్నతల్లి లాంటి చెరువును మింగేసేందుకు కొందరు బడా వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చెరువు మధ్యలోనే ఏకంగా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని విమర్శిస్తున్నారు. చెరువులో జరుగుతున్న పనులను ప్రశ్నించిన రైతులు, గ్రామస్తులకు సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొంతనలేని సమాధానాలు చెబుతూ పనులను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ కబ్జా ప్రయత్నాలను అడ్డుకోకపోతే భవిష్యత్ తరాలు తమను చీత్కరించుకునే పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే నంబర్లు 223, 224లో కబ్జా ఆరోపణలు:



28/08/2026 | Main Edition | Page : 3
Source : https://epaper.tholivelugu.com/

**ఇరిగేషన్ శాఖ సర్వే అవసరం:**

చెరువు అసలు పరిధి, శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఇరిగేషన్ శాఖ సర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**'తల్లి లాంటి చెరువును కాపాడాలి':**

మల్లాయి చెరువు గ్రామ ప్రజలు, రైతుల జీవనాధారంతో పాటు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విలువైన ఆస్తి అని గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువును పూర్తిస్థాయిలో పరిరక్షించకపోతే గ్రామస్తులు, రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. చెరువు ఆక్రమణపై తొలివెలుగు వరుస కథనాలతో స్పందించిన అధికార యంత్రాంగం.. ఇప్పుడు మల్లాయి చెరువును పూర్తిస్థాయిలో కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.


చెరువును ముంచేస్తున్న రియల్ మాఫియా!
- నామరూపాలు లేకుండా మల్లాయి చెరువు..?
- చెరువు శిఖం, కట్ట తొలగిస్తున్నారంటూ రైతులు, గ్రామస్తుల ఆందోళన

# అనుబంధాల 'రక్ష'.. కోలాహలంగా రాఖీ పండగ

- చిన్నగూడూరు మండలంలో మిన్నంటిన వేడుకలు
- పవిత్ర బంధాన్ని చాటుకున్న సోదర సోదరీమణులు
- సోదరుల చేతులకు రాఖీలు కట్టిన సోదరీమణులు
- అనుబంధాలను స్మరించుకున్న అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు

**తొలివెలుగు, చిన్నగూడూరు :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నగూడూరు మండల వ్యాప్తంగా శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత కోలాహలంగా జరిగాయి. అక్కాచెల్లెళ్లు తమ సోదరుల చేతులకు ప్రేమతో రాఖీలు కట్టి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం తీపి పదార్థాలు తినిపించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోదరులు తమ సోదరీమణులకు ప్రేమతో కానుకలు అందజేసి, జీవితాంతం వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్ననాటి తీపి జ్ఞాపకాలు, తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు, కుటుంబ బంధాలను స్మరించుకుంటూ పలువురు ఆనందోత్సాహాలతో గడిపారు.

**పవిత్ర బంధానికి ప్రతీక:**

రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పండుగల్లో ఒకటని, ఇది సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయత, బాధ్యతను మరింత బలోపేతం చేస్తుందని మండల ప్రజలు పేర్కొన్నారు. కేవలం రాఖీ కట్టడం, కానుకలు ఇచ్చిపుచ్చుకోవడం మాత్రమే కాకుండా జీవితాంతం పరస్పరం అండగా నిలుస్తామనే భరోసాకు ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

**ద్రౌపది-కృష్ణుల అనుబంధం స్మరణ:**



శ్రీకృష్ణుడి వేలికి గాయం కాగా ద్రౌపది తన చీర కొంగును చింపి కట్టు కట్టిన ఘటనను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. ఆ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, అనంతరం ఆపద సమయంలో ద్రౌపదిని శ్రీకృష్ణుడు కాపాడిన పురాణ గాథ రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, చిన్నారులు రాఖీ పండుగ



వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటా రాఖీల సందడి, తీపి జ్ఞాపకాలు, ఆప్యాయతలతో 'అనుబంధాల రక్ష'గా రాఖీ పౌర్ణమి వేడుకలు చిన్నగూడూరు మండలంలో సందడిగా సాగాయి.



## భక్తిశ్రద్ధలతో సామూహిక గాయత్రీధారణ

- చిట్యాల శివాలయంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు
- వేద మంత్రోచ్ఛారణల మధ్య గాయత్రీధారణ
- ఆధ్యాత్మిక చైతన్యానికి తోడ్పడేలా కార్యక్రమాలు

**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల పట్టణంలోని శివాలయంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక గాయత్రీధారణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో గాయత్రీ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జంధ్యం విశిష్టత, గాయత్రీ మంత్రం ప్రాముఖ్యతను భక్తులకు వివరించిన అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య సామూహికంగా గాయత్రీధారణ గావించారు. హిందూ సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు అందించడంతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెల్లా మనోహార్, ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, పున్న పాండు, జెల్లా సత్తయ్య, గంజి సుధాకర్, చేపూరి శ్రీనివాస్, వలకీర్తి రమేష్, రాపోలు లక్ష్మయ్య, గంజి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమానురాగాల పండగ.. చిట్యాలలో రాఖీ సంబరాలు

- హుషారుగా రక్షాబంధన్ వేడుకలు
- ఆత్మీయతను చాటుకున్న అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు
- సోదరులకు రాఖీలు కట్టి ప్రేమను పంచుకున్న సోదరీమణులు



**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల మండల వ్యాప్తంగా శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు అత్యంత ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరుల నుదుటన తిలకం దిద్ది, చేతులకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కోరుకున్నారు. అనంతరం మిఠాయిలు తినిపిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు కూడా తమ అక్కాచెల్లెళ్లకు ప్రేమతో కానుకలు అందజేసి, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వివాహమై దూర ప్రాంతాల్లో నివసిస్తున్న పలువురు మహిళలు సైతం పుట్టింటికి చేరుకుని తమ సోదరులకు రాఖీలు కట్టడంతో మండలంలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చాలా కుటుంబాల్లో బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ బంధాలు, ప్రేమానురాగాలు, పరస్పర ఆత్మీయతను ప్రతిబింబించే రక్షాబంధన్ వేడుకల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. రాఖీ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించగా, పలు రకాల రంగురంగుల రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న అపురూపమైన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే పండుగగా రక్షాబంధన్ నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

## అక్రమ గో రవాణా గుట్టురట్టు

- 13 గోవులను రక్షించిన బజరంగ్‌దళ్, పోలీసులు
- పిలాయిపల్లి వద్ద వాహనం పట్టివేత
- నిందితులపై కేసు నమోదు.. గోవులను గోశాలకు తరలింపు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** కబేళాకు అక్రమంగా తరలిస్తున్న 13 గోవులను బజరంగ్‌దళ్ కార్యకర్తలు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన భూదాన్ పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై జగన్, బజరంగ్‌దళ్ ప్రతినిధుల వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ నుంచి అశోక్ లేలాండ్ వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా, క్రూరమైన స్థితిలో 10 మగ దూడలు, 3 ఆవు దూడలను తరలిస్తున్నారు. పిలాయిపల్లి వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న ఈ వాహనాన్ని గమనించిన బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకుని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ?సమాచారం అందుకున్న ఎస్ఐ జగన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని తనిఖీ చేసి సీజ్ చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేసి, రక్షించిన గోవులను రంగారెడ్డి జిల్లా జాఫర్‌గూడ సమీపంలోని పాత్యాంగరి గోశాలకు తరలించారు. అక్రమంగా గోవులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, అనుమానాస్పద వాహనాలపై నిఘా పెంచుతామని ఎస్ఐ హెచ్చరించారు.

# ప్రేమానురాగాల 'రక్షాబంధన్'

- నిడమానూరులో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు
- సోదరసోదరీమణుల ఆత్మీయ బంధానికి ప్రతీకగా వేడుకలు
- కొనుగోలుదారులతో రద్దీగా మారిన రాఖీ దుకాణాలు
- రూపాయి నుంచి రూ.వెయ్యి వరకు వివిధ రకాల రాఖీల విక్రయం






**తొలివెలుగు, నిడమానూరు :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిడమానూరు మండల వ్యాప్తంగా శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలను అత్యంత సంతోషకర, ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అక్కాచెల్లెళ్లు తమ సోదరుల చేతులకు ప్రేమతో రాఖీలు కట్టి, వారి ఆశీస్సులు అందుకున్నారు. తోడబుట్టిన వారి మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలను మరింత బలోపేతం చేసే పండుగగా రక్షాబంధన్‌కు ప్రత్యేకత ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. జీవితాంతం పరస్పరం అండగా నిలుస్తామనే భరోసాకు రాఖీ బంధం ప్రతీకగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

**కొనుగోలుదారులతో కిటకిటలాడిన దుకాణాలు:**

పండుగ నేపథ్యంలో నిడమానూరు మండల కేంద్రంలోని ప్రధాన వీధులు, రాఖీ విక్రయ దుకాణాల వద్ద విశేష సందడి నెలకొంది. వివిధ రంగులు, ఆకర్షణీయమైన డిజైన్లు, సరికొత్త మోడళ్లతో కూడిన రాఖీలను వ్యాపారులు విక్రయానికి ఉంచారు. రూపాయి నుంచి రూ.వెయ్యి వరకు విలువ చేసే వివిధ రకాల రాఖీలు మార్కెట్‌లో అందుబాటులో ఉండటంతో కొనుగోలుదారులు తమకు నచ్చిన రాఖీలను కొనుగోలు చేశారు. గతంలో కంటే ఈసారి కొత్త డిజైన్లు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచే రాఖీలు అందుబాటులోకి రావడంతో దుకాణాలకు వినియోగదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శుక్రవారం రోజంతా మండల కేంద్రంలోని రాఖీ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడగా, ప్రేమానురాగాల 'రక్షాబంధన్' వేడుకలు నిడమానూరు మండలంలో ఆనందోత్సాహాల మధ్య సాగాయి.



## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి రాఖీ కట్టిన నవనీత

- మునుగోడు ఎమ్మెల్యేకు రక్షాబంధన్ శుభాకాంక్షలు
- ఆత్మీయంగా కలిసిన యువజన కాంగ్రెస్ నేతలు

**తొలివెలుగు, వలిగొండ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల శ్రీశైలం కురుమ, ఆయన సతీమణి దయ్యాల నవనీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి దయ్యాల నవనీత రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేళ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించినట్లు నవనీత తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ఆయనకు ప్రసాదించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజాసేవలో ముందుండే రాజగోపాల్ రెడ్డి సేవలు మరింత విస్తరించాలని శ్రీశైలం కురుమ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభ.. 'నూలు పౌర్ణమి' సంబరం

- పోచంపల్లి మార్కండేయ ఆలయంలో భక్తిపారవశ్యం
- ఘనంగా సామూహిక గాయత్రీధారణ, గాయత్రీ యజ్ఞం
- రాఖీ పౌర్ణమి వేడుకలతో పట్టణంలో పండుగ సందడి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి, నూలు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తులు సామూహిక గాయత్రీధారణ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య గాయత్రీధారణ చేపట్టగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు సీత సత్యనారాయణ ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, యజ్ఞ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. మరోవైపు రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పోచంపల్లి పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆడపడుచులు పుట్టింటికి చేరుకోవడంతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. తోడబుట్టినవారి ప్రేమానురాగాలు, ఆత్మీయ కలయికలు, రాఖీ వేడుకలతో పోచంపల్లి వీధులు కోలాహలంగా కనిపించాయి. నూలు పౌర్ణమి ఆధ్యాత్మిక సంప్రదాయాలను, రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని ప్రతిబింబించేలా పోచంపల్లిలో వేడుకలు ఘనంగా కొనసాగాయి.



# వృత్తినే దైవంగా.. విద్యాసేవే శ్వాసగా!

- రాజపేట ఎంఈఓ చందా రమేష్ ఉద్యోగ విరమణ
- నేడు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం
- ఉపాధ్యాయుడి నుంచి ఉత్తమ ఎంఈఓ వరకు సాగిన ప్రస్థానం

**తొలివెలుగు, రాజపేట :** వృత్తినే దైవంగా భావించి విద్యాశాఖలో అజాతశత్రువుగా పేరుపొందిన రాజపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ ఈ నెల 29న ఉద్యోగ విరమణ పొందనున్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పోతునూరు గ్రామానికి చెందిన రమేష్, చందా రంగయ్య-కమలమ్మల ఏడుగురు సంతానంలో చిన్నవాడు. పదో తరగతి వరకు నల్లగొండ గీత విజ్ఞాన ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో, డిగ్రీ ఎన్జీ కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో బీఈడీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ పట్టా పొందారు.




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - పాముకుంట
మండల విద్యాశాఖ - రాజపేట
ఉద్యోగ విరమణ వీడ్కోలు ఆత్మీయ సమ్మేళనం - సదస్సు
ఆహ్వానము
శ్రీమతి & శ్రీ చందా సునిత - రమేష్
GHM & MEO
ఉపాధ్యాయ వృత్తిలో 37 సంవత్సరాలుగా పనిచేస్తూ ఈ నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీ చందా రమేష్ GHM మరియు MEO రాజపేట మండలం గారి ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళనానికి మిమ్ములను సాదరంగా ఆహ్వానిస్తున్నాము
తేది :- 29-08-2026 శనివారం రోజున మధ్యాహ్నం 12:00 గం॥కు
వేదిక :- చెల్మిడి ఫంక్షన్‌హాల్, పాముకుంట రోడ్ రాజపేట, యాదాద్రి భువనగిరి జిల్లా.
సభాధ్యక్షులు:- శ్రీ పున్న సత్యానంద్, సీనియర్ ఉపాధ్యాయులు
ముఖ్య అతిధి :- శ్రీ బొల్లారం బిక్షపతి, జిల్లా విద్యాశాఖాధికారి
ప్రధాన వక్త :- శ్రీ అప్పాల ప్రసాద్, కన్వీనర్, సామాజిక సమరసత వేదిక
అంశం: - భారతీయ విద్య - ఒక పరిశీలన
ప్రత్యేక ఆహ్వానితులు:- 1) ఉపాధ్యాయ సంఘం ల రాష్ట్ర ప్రధాన బాధ్యులు
2) గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, రాజపేట మండలం
3) ఉపాధ్యాయ సంఘం ల జిల్లా ప్రధాన బాధ్యులు
4) రాజపేట మండల ఉపాధ్యాయ సంఘం ల ప్రధాన బాధ్యులు
5) మండల ప్రజా ప్రతినిధులు
ఆహ్వానించువారు : -
పాఠశాల ఉపాధ్యాయ బృందం, ZPHS పాముకుంట - MRC సిబ్బంది, రాజపేట

**ఎస్జీటీ హోదా నుంచి ఎంఈఓ వరకు...**

ఉపాధ్యాయుడిగా పీఏ పల్లి మండలం మేడారం యూపీఎస్‌లో మొదటి నియామకం పొందారు. అనంతరం బీబీనగర్ మండలం రాజారావుపేటకు బదిలీ అయ్యారు. 2001లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది బట్టుగూడకు, 2009లో చౌటుప్పల్ మండలం పీపుల్ పహాడ్‌కు, 2018లో కొండమడుగు ఉన్నత పాఠశాలకు వెళ్లారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా (జీహెచ్‌ఎం) పదోన్నతి పొంది రాజపేట మండలం పాముకుంట పాఠశాలకు విచ్చేసారు. అదే సమయంలో ఇన్‌ఛార్జ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టి మండలంలోని 42 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సమర్థంగా పర్యవేక్షించారు. నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించి కలెక్టర్ ప్రశంసలు పొందడంతో పాటు, 2025 సెప్టెంబరులో గురుపూజోత్సవం సందర్భంగా 'జిల్లా ఉత్తమ ఎంఈఓ' అవార్డును అందుకున్నారు.



**పాఠశాలల్లో సాంస్కృతిక శోభ.. సామాజిక ఔదార్యం:**

'తపస్' ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవస్థాపక కార్యదర్శిగా (1992), 'అధ్యాపక భారతి' మాసపత్రిక సంపాదకుడిగా దశాబ్ద కాలం సేవలుందించారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో వార్షికోత్సవాలు నిర్వహించి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీశారు. తన భార్య సునీతతో కలిసి మధ్యాహ్న భోజన వర్కర్లకు ఉచితంగా చీరలు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ విశిష్ట విద్యాధికారికి ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అభినందన సత్కార సభ ఏర్పాటు చేశారు.




# చలో సెక్రటేరియట్‌కు మాలలు తరలిరావాలి

- మాలలకు రోస్టర్ విధానంలో న్యాయం చేయాలని డిమాండ్
- ఈ నెల 31న సెక్రటేరియట్ ముట్టడికి పిలుపు

**తొలివెలుగు, వలిగొండ :** విద్య, ఉద్యోగ అవకాశాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న చేపడుతున్న 'చలో సెక్రటేరియట్' ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం మండల అధ్యక్షుడు కూచిమల్ల నాగేష్ అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ మాల మహానాడు పిలుపు మేరకు నిర్వహించే సెక్రటేరియట్ ముట్టడికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, మాల సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు రాపోలు పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పుర్మ అంజయ్య, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, దాసరి లింగస్వామి, రాపోలు కృష్ణ, రాపోలు మూర్తి, రామలింగం, రాపోలు రమేష్, కేతం ఇంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డికి రాఖీ కట్టిన దయ్యాల నవనీత

- రాష్ట్ర మంత్రికి పండుగ శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష



**తొలివెలుగు, వలిగొండ :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన నివాసంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల శ్రీశైలం కురుమ, ఆయన సతీమణి దయ్యాల నవనీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నవనీత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సోదర సోదరీమణుల ప్రేమానురాగాలకు ప్రతీక అని, మంత్రి కోమటిరెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించాలని నవనీత ఆకాంక్షించారు. అనంతరం శ్రీశైలం కురుమ మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మంత్రి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- విద్యుత్ అమరులకు సీపీఐ ఘన నివాళి
- కమ్యూనిస్టుల పోరాట ఫలితమే ఉచిత విద్యుత్

**తొలివెలుగు, వలిగొండ :** విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ అన్నారు. వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి సీపీఐ మాజీ కార్యదర్శి పోలేపాక యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ... నాడు టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు, సంస్కరణలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ అమరులయ్యారని గుర్తుచేశారు. వామపక్షాల ఆ పోరాట స్ఫూర్తితోనే నేడు ప్రజలకు ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుడు శీలం స్వామి, బీసీ సంఘం నాయకుడు సాయిని యాదగిరి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలను ఉద్ధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సల్వాద్రి రవీందర్, సమితి సభ్యులు బొడిగే సుదర్శన్, చొప్పరి వెంకటేశం, కనకబోయిన ఆంజనేయులు, ఏఐటీయూసీ నాయకులు ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల నరసయ్య, ఆదిమూలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# ఓ వైపు వనమహోత్సవం.. మరోవైపు చెట్ల నరికివేత..?

- చిన్నకొండూరు దేపోని చెరువు పరిధిలో చెట్ల నరికివేతపై కలకలం
- ఒక్కరోజులోనే రెండు లారీల కలప.. అటవీ శాఖకు అప్పగించిన గ్రామస్తులు
- సుమారు 2 వేల మూగజీవాల పశుగ్రాసం నాశనమైందంటూ పెంపకందారుల ఆందోళన
- మోటార్ల వద్దకు వెళ్లేందుకే చెట్లు నరికామంటున్న గ్రామపంచాయతీ





**తొలివెలుగు, చౌటుప్పల్ :** ఓ వైపు పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహిస్తూ విరివిగా మొక్కలు నాటుతుండగా, మరోవైపు చెట్లను విచక్షణారహితంగా నరికివేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని దేపోని చెరువు వద్ద కలకలం రేపుతోంది. చెరువులోని చెట్లను పెద్ద ఎత్తున నరికివేసి కలపను రెండు లారీల్లో తరలించేందుకు సిద్ధం చేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్కరోజులోనే రెండు లారీల కలప!**

ఈ నెల 27న దేపోని చెరువు పరిధిలో జేసీబీ, క్రేన్‌ల సహాయంతో సుమారు 50 మంది పెద్ద ఎత్తున చెట్లను నరికినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నరికిన చెట్ల కలపను రెండు లారీల్లో నింపి తరలించేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సాయంత్రం లారీలను అడ్డుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. చెట్ల నరికివేతకు అటవీ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, తమకు ముందస్తు సమాచారం కూడా లేదని అధికారులు పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది కలపతో నిండిన రెండు లారీలను స్వాధీనం చేసుకుని అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

**రెండు వేల మూగజీవాలకు పశుగ్రాసం:**

చిన్నకొండూరు గ్రామంలో పశుపోషణ ప్రధాన జీవనాధారాల్లో ఒకటి. గ్రామపంచాయతీ పరిధిలోని దేపోని చెరువు చుట్టుపక్కల ఉన్న చెట్లు, పొదలు సుమారు రెండు వేల వరకు మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలకు పశుగ్రాసాన్ని అందిస్తున్నాయని పాడి రైతులు, పశుపోషకులు చెబుతున్నారు. ముఖ్యంగా 20 ఏళ్లకు పైబడిన తుమ్మ చెట్లు మేకలు, గొర్రెలకు ఎంతో ఉపయోగకరమైన మేతను అందించేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున చెట్లను నరికివేయడంతో తమ మూగజీవాలకు మేత ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నిస్తున్నారు. అసలు ఎవరిని అడిగి చెట్లను నరికివేశారని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

**కలప కోసమే నరికారా..?**

చెరువులో ఇంత పెద్ద ఎత్తున చెట్లను నరికివేసి రెండు లారీల్లో కలపను నింపడం పట్ల గ్రామస్తుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెట్ల నరికివేత వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశు గ్రాసానికి ఉపయోగపడే చెట్లను నరికివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పశుపోషకులు ప్రశ్నిస్తున్నారు.

**గ్రామపంచాయతీ తీర్మానం మేరకే..:**

అయితే, దేపోని చెరువులో చెట్ల నరికివేతకు గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసినట్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శి తెలిపారు. చెరువులో గ్రామపంచాయతీకి చెందిన రెండు మోటార్లు ఉన్నాయని, వాటి ద్వారా గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. మోటార్లు భూమిలో కూరుకుపోవడంతో వాటి వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అందుకే చెట్లను తొలగించాలని పాలకవర్గం నిర్ణయించిందని వివరించారు. అయితే చెట్ల నరికివేతకు సంబంధించిన నిబంధనలు, అనుమతులపై సంబంధిత శాఖలు విచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


**ఉన్నతాధికారులకు ఫిర్యాదుకు సన్నాహాలు:**

దేపోని చెరువులో జరిగిన చెట్ల నరికివేతపై పాడి రైతులు, పశుపోషకులు, గ్రామస్తులు ఏకమవుతున్నారు. పాలకవర్గం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆరోపిస్తున్నారు. గ్రామానికి సంబంధించిన కీలక అంశాలపై గ్రామసభలో కూలంకషంగా చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. చెట్ల నరికివేతతో పాటు పశు గ్రాసం నష్టం, కలప తరలింపు వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై అటవీ, పంచాయతీ, రెవెన్యూ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.






# ఆధ్యాత్మిక పారవశ్యం.. యజ్ఞోపవీత ధారణ



- రాజాపేట మండలంలో ఘనంగా జంధ్యాల పున్నమి వేడుకలు

**తొలివెలుగు, రాజాపేట:** జంధ్యాల పున్నమిని పురస్కరించుకుని రాజాపేట మండల వ్యాప్తంగా వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బేగంపేట గ్రామంలోని భక్త మార్కండేయ మందిరంలో పద్మశాలి కుల పెద్ద భోగ హరినాథ్ ఆధ్వర్యంలో గాయత్రి హోమం సాంప్రదాయబద్ధంగా సాగింది. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు వేద మంత్రోచ్చారణల నడుమ సామూహిక యజ్ఞోపవీత ధారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ పంతులు నల్ల విష్ణు, చెడుదీపు కృష్ణ, కమిటీ అధ్యక్షుడు పెంట గోపాల్, ప్రధాన కార్యదర్శి చిన్నం బాలస్వామి, కోశాధికారి భోగ నాగరాజు, సభ్యులు పెంట ఆంజనేయులు, భోగ శ్రీకాంత్, నల్ల నరసింహులు, భోగ జనార్ధన్, పెంట భాను, భోగ ధర్మేష, పెంట భాస్కర్, చెడుదీపు వరదేశు, కామ్ శ్రీరాములు, భోగ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో కమిటీ అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహికంగా యజ్ఞోపవీతాలను ధరించారు.

# రాజపేట ఠాణాలో వేడుకగా 'రాఖీ'

- ఎస్సైకి రాఖీలు కట్టిన మహిళా పోలీసులు
- మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధం: ఎస్ఐ తక్కుద్దీన్

**తొలివెలుగు, రాజపేట :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విధుల్లో నిమగ్నమైన మహిళా పోలీస్ సిబ్బంది, ఎస్ఐ తక్కుద్దీన్‌తో పాటు తోటి పురుష సిబ్బందికి రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై తక్కుద్దీన్ రాజపేట మండల ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో మహిళల భద్రత, గౌరవ ప్రదమైన రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లవేళలా ముందుంటుందని, ఏ సమయంలోనైనా సహాయం కోసం ఠాణాను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# దిగొచ్చిన పుత్తడి

**రూ.3,300 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, ఆగస్టు 28: బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. డాలర్ బలహీనపడటంతోపాటు ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌ను మొగ్గుచూపడంతో దేశీయంగా పుత్తడి ధర భారీగా పడిపోయింది. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర శుక్రవారం ఏకంగా రూ.3,300 తగ్గి రూ.1.62 లక్షలకు పడిపోయింది. వరుసగా ధరలు తగ్గడం ఇది మూడోరోజు కావడం విశేషం. గత మూడు సెషన్లలో గోల్డ్ ఏకంగా రూ.4,700 లేదా 3 శాతం తగ్గినట్టు అయింది. ఈ నెల 25న గోల్డ్ ధర రూ.1,67,100గా ఉన్న విషయం తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు భారీగా పడిపోయాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో కిలో వెండి రూ.5 వేలు తగ్గి రూ.2,45,500లకు పడిపోయింది. గత ముగింపు రూ.2,50,500గా ఉన్నది. ఈ వారంలో బంగారం, వెండి ధరలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయని, ట్రేడర్లు బుకింగ్ ప్రాఫిట్‌కు మొగ్గుచూపడం, డాలర్ బలహీనపడటం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, విదేశాల నుంచి బంగారం అక్రమ రవాణా పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించే అవకాశాలు ఉన్నట్టు వచ్చిన వార్తలు కూడా ధరలు తగ్గడానికి మరో కారణమని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4,599.70 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, వెండి 70.31 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

# జియో ఐపీవోకి సెబీ గ్రీన్ సిగ్నల్.. త్వరలో మార్కెట్లోకి!

దేశీయ కార్పొరేట్ రంగం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు మార్గం సుగమమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (సెబి) శుక్రవారం (ఆగస్టు 28న) తుది ఆమోదం తెలిపింది. ఈ అనుమతి లభించడంతో నిధుల సమీకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు కంపెనీకి లైన్ క్లియర్ అయింది. ఈ ఐపీవో ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 37,700 కోట్లు) సమీకరించాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం నెరవేరితే, ఇటీవలే వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఐపీవో (రూ. 27,000 కోట్లు)ను అధిగమించి, భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఇది రికార్డు సృష్టిస్తుంది. ఈ ఐపీవో కోసం జియో ప్లాట్‌ఫామ్స్ జూన్ నెలలోనే సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది. ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ సుమారు 27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. దీనివల్ల కంపెనీ మొత్తం ఈక్విటీలో 2.9 శాతం వాటా విక్రయానికి రానుంది. గత కొన్నేళ్లుగా మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు జియో ఐపీవో కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 2020లోనే జియో ప్లాట్‌ఫామ్స్‌లో మెటా (ఫేస్‌బుక్) రూ.43,574 కోట్లు, గూగుల్ రూ.33,737 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి. వీటితో పాటు మరికొన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి కూడా కంపెనీ భారీగా నిధులను సమీకరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, జియో ఐపీవో భారత మార్కెట్‌లో ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# టెలికం రంగంలో ఎయిర్‌టెల్ జోరు!

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ జూలైలో అత్యధికంగా కొత్త యూజర్లను దక్కించుకుంది. గత నెల కంపెనీ కనెక్షన్ల సంఖ్య నికరంగా 26.8 లక్షలు పెరిగింది. మరో అగ్రగామి రిలయన్స్ జియో కొత్త యూజర్లు 24.4 లక్షల మేర పెరిగారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం జూలైలో భారతి ఎయిర్‌టెల్ వైర్‌లెస్ యూజర్ల సంఖ్య 48.94 కోట్లకు, జియో సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 50.60 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియా మొబైల్ యూజర్లు 2.4 లక్షలు పెరిగి మొత్తం 19.90 కోట్లకు చేరారు. అటు ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్లు కూడా 1.68 లక్షల మేర పెరిగాయి. కొత్తగా 55.38 లక్షల మొబైల్ యూజర్ల చేరికతో దేశీయంగా వైర్‌లెస్ సబ్?రస్కయిబర్స్ సంఖ్య 128.79 కోట్లకు చేరింది. అంతక్రితం నెల ఇది 128.23 కోట్లుగా నమోదైంది. 1,562 ఆపరేటర్ల నుంచి లభించిన వివరాల ప్రకారం మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సబ్?రస్కయిబర్స్ సంఖ్య జూన్ ఆఖరు నాటికి 108.75 కోట్లుగా ఉండగా జూలై చివరికి 109.44 కోట్లకు పెరిగిందని ట్రాయ్ తెలిపింది.




# లిస్టింగ్‌కు 4 కంపెనీలు రెడీ

న్యూఢిల్లీ: కొద్ది నెలలుగా దుమ్ము రేపుతున్న ప్రైమరీ మార్కెట్లకు జోష్‌నిస్తూ తాజాగా నాలుగు కంపెనీల లిస్టింగ్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో పారస్ హెల్త్‌కేర్, భారత్ పెట్ లిమిటెడ్, ఎంకే సన్స్ ఫైన్ జ్యువెల్స్, సద్భావ్ ఫ్యూచర్‌టెక్ చేరాయి. ఈ ఏడాది మార్చి–జూన్ మధ్య కాలంలో ఈ కంపెనీలు సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. కాగా.. ఇప్పటికే ప్యాకేజ్‌డ్ మసాలా దినుసుల కంపెనీ పుష్ప్ బ్రాండ్(ఇండియా)సహా.. ఫిన్‌టెక్ సంస్థ పారామోటార్ డిజిటల్ టెక్నాలజీ ఐపీవోలకు సైతం సెబీ అనుమతి ఇచ్చిన విషయం విదితమే. ఇతర వివరాలు చూద్దాం..




**రూ. 1,800 కోట్లకు రెడీ**

పారస్ హెల్త్‌కేర్ జూన్ 16న దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా రూ.500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి అదనంగా రూ. 1,300 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులకు, సొంత అనుబంధ సంస్థ పీఎంహెచ్‌పీఎల్ రుణాల చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. పారస్ హెల్త్ బ్రాండుతో 8 ఆసుపత్రులను నిర్వహిస్తున్న కంపెనీ 2026 మార్చి31కల్లా 2,211 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

**ప్రమోటర్లు, ఇన్వెస్టర్ల వాటా..**

సద్భావ్ ఫ్యూచర్‌టెక్ ఏప్రిల్ 7న దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా 2.55 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 235 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్‌తోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

**రూ. 760 కోట్లపై దృష్టి**


భారత్ పెట్ మార్చి 25న దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా రూ. 120 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 640 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 760 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 50 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 36 కోట్లు మెషీనరీ, పరికరాల కొనుగోలు(పెట్టుబడి వ్యయాలు)కు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

**ఈక్విటీ షేర్ల జారీతో..**

ఎంకే సన్స్ ఫైన్ జ్యువెల్స్ మే 14న దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా 1.36 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 34 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్ రామ్‌చంద్ మురళీధర్ ఆర్. విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను మహారాష్ట్రలో కొత్త షోరూముల ఏర్పాటుతోపాటు.. గుజరాత్‌లోని ప్రస్తుత స్టోర్ల విస్తరణకు, రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

# రూ.1 లక్ష పెట్టుబడికి.. రూ.44 లక్షల లాభం?

గురువారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయంలో సెన్సెక్స్‌లో ఒక్కసారిగా భారీ మార్పులు కనిపించాయి. దీంతో ట్రేడర్లలో దీనిపై చర్చ మొదలైంది. ఓ ట్రేడర్ ఎక్స్‌లో చేసిన పోస్ట్ ప్రకారం.. సెన్సెక్స్ 76,500 పుట్ ఆప్షన్‌లో మధ్యాహ్నం 3.15 గంటలకు రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి, 3.20 గంటలకు విక్రయించి ఉంటే దాదాపు రూ.44 లక్షల లాభం వచ్చేదని పేర్కొన్నారు. అయితే ఇది కేవలం ఊహాత్మక లెక్క మాత్రమే. నిజంగా ఎవరో రూ.1 లక్ష పెట్టి రూ.44 లక్షలు సంపాదించారని భావించకూడదు. అంతేకాదు.. అసలు పోస్టులో 3.15గ్రావీకు బదులుగా పొరపాటున 3.15ాావీ అని పేర్కొన్నారు.



**సెన్సెక్స్‌లో అనూహ్య కదలికలు**

నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ రోజున మార్కెట్ క్లోజింగ్ సమయంలో సెన్సెక్స్‌లో అనూహ్య కదలికలు చోటుచేసుకున్నాయి. మధ్యాహ్నం 3.17 గంటలకు సుమారు 77,200 వద్ద ఉన్న సెన్సెక్స్.. కేవలం కొన్ని నిమిషాల్లోనే 74,983 స్థాయికి పడిపోయింది. అంటే 2,000 పాయింట్లకు పైగా క్షీణించింది. ఆ తర్వాత అంతే వేగంగా కోలుకుని, మరో ఏడు నిమిషాల్లో దాదాపు 2,000 పాయింట్లు తిరిగి పుంజుకుంది. చివరకు సెన్సెక్స్ 76,934 వద్ద ముగిసింది. దీంతో బుధవారం ముగింపుతో పోలిస్తే 539 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది.

**కీలక షేర్లలోనూ భారీ మార్పులు**

సెన్సెక్స్‌లో వచ్చిన ఈ కదలికలు ఇతర ప్రధాన షేర్లలోనూ కనిపించాయి. సెన్సెక్స్‌లో అత్యధిక వెయిటేజీ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సుమారు రూ.1,289 నుంచి రూ.1,250కి పడిపోయింది. ఆ తర్వాత మళ్లీ వేగంగా పుంజుకుని రూ.1,286 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, భారతి ఎయిర్‌టెల్ వంటి ప్రముఖ షేర్లలోనూ మార్కెట్ ముగిసే సమయంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి.

**క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌పై ప్రశ్నలు**

ఈ పరిణామాలతో బీఎస్‌ఈ ఇటీవల తీసుకొచ్చిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (జూూా)పై కూడా చర్చ మొదలైంది. ఆగస్టు 3 నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానం ద్వారా మార్కెట్ ముగింపు ధరను మరింత పారదర్శకంగా నిర్ణయించడం, ధరల తారుమారుకు అవకాశం తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జూూా ప్రారంభమైన తర్వాత మార్కెట్ చివరి 15 నిమిషాల్లో సెన్సెక్స్, నిఫ్టీల్లో అసాధారణ స్థాయిలో కదలికలు కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సెబీ చర్యలతో ఆసక్తి**

ఇటీవల సెన్సెక్స్, దాని కీలక షేర్లకు సంబంధించిన ట్రేడింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సెబీ రెండు సంస్థలపై చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే రూ.1 లక్ష నుంచి రూ.44 లక్షల లాభం అన్నది ఒక ట్రేడర్ చేసిన హైపోతెటికల్ లెక్క మాత్రమే. వాస్తవ ట్రేడింగ్‌లో ఆ ధరకు ఆప్షన్‌ను కొనడం, సరైన సమయంలో విక్రయించడం, మార్కెట్‌లో లిక్విడిటీ ఉండటం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అందుకే ఈ ఉదాహరణను ఖచ్చితమైన లేదా సులభమైన లాభ అవకాశంగా చూడకూడదు. పెట్టుబడిదారులు ఈ విషయాన్ని తప్పకుండా గమనించాలి.

# బ్లాక్ డీల్స్.. చేతులు మారిన రూ.వేల కోట్ల వాటాలు

దేశీయ స్టాక్ మార్కెట్లో భారీ బ్లాక్ డీల్స్ చోటుచేసుకున్నాయి. రూబికాన్ రీసెర్చ్, అపోలో టైర్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, వెల్‌స్పన్ కార్ప్ కంపెనీల్లో ప్రమోటర్లు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు భారీగా వాటాలను విక్రయించగా.. సంస్థాగత ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు. ఫార్మాస్యూటికల్ కంపెనీ రూబికాన్ రీసెర్చ్‌లో ప్రమోటర్ సంస్థలలో ఒకటైన జనరల్ అట్లాంటిక్ 8.38 శాతం వాటా విక్రయించింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో పలు బ్లాక్ డీల్స్ ద్వారా 1,38,53,073 షేర్లను(8.38 శాతం వాటా) విక్రయించింది. ఒక్కో షేరుకీ రూ. 1,660 సగటు ధరలో చేపట్టిన విక్రయం ద్వారా దాదాపు రూ. 2,300 కోట్లు అందుకుంది. దీంతో రూబికాన్ రీసెర్చ్‌లో జనరల్ అట్లాంటిక్ సింగపూర్ ఆర్ఆర్ పీటీఈ వాటా 35.83 శాతం నుంచి 27.45 శాతానికి క్షీణించింది. వెరసి కంపెనీ మొత్తం ప్రమోటర్ల వాటా 59.76 శాతం నుంచి 51.38 శాతానికి తగ్గింది. ఈ వాటాను దేశ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ సంస్థలు కొనుగోలు చేశాయి. జాబితాలో హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా, ఐసీఐసీఐ ప్రు, ఎస్‌బీఐ, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్స్‌తోపాటు.. నోమురా ఇండియా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ మదర్ ఫండ్, అరండా ఇన్వెస్ట్‌మెంట్స్ పీటీఈ, వీఈఎంఎఫ్--ఏ ఎల్‌పీ తదితరాలున్నాయి. పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా తాజాగా అపోలో టైర్స్‌లో 4.25 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ బ్లాక్ డీల్స్ ప్రకారం అనుబంధ సంస్థ ఎమరాల్డ్ సేజ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా 2,70,10,000 షేర్లను(4.25 శాతం వాటా) విక్రయించింది. ఒక్కో షేరుకీ రూ. 435 సగటు ధరలో చేపట్టిన విక్రయంతో దాదాపు రూ. 1,175 కోట్లు అందుకుంది. దీంతో అపోలో టైర్స్‌లో ఎమరాల్డ్ సేజ్ వాటా 9.93 శాతం నుంచి 5.68 శాతానికి క్షీణించింది. ఈ వాటాలో ఐసీఐసీఐ ప్రు ఎంఎఫ్ ఎమర్జింగ్ 3 శాతం వాటాను రూ. 830 కోట్లకు కొనుగోలు చేయగా.. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ 56.32 లక్షల షేర్లు(రూ. 245 కోట్లు), బజాజ్ లైఫ్ 22.98 లక్షల షేర్లు(రూ. 100 కోట్లు) చొప్పున సొంతం చేసుకున్నాయి. న్యూఢిల్లీ: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీలో హాంకాంగ్ సంస్థ ప్రుడెన్షియల్ పీఎల్‌సీ 1.99 శాతం వాటా విక్రయించింది. బీఎస్ఈ బ్లాక్ డీల్స్ ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 98,85,169 షేర్లను(1.99 శాతం వాటా) విక్రయించింది. ఒక్కో షేరుకీ రూ. 3,065.5 సగటు ధరలో చేపట్టిన విక్రయం ద్వారా రూ. 3,030 కోట్లు అందుకుంది. దీంతో ఐసీఐసీఐ ప్రు ఏఎంసీలో ప్రుడెన్షియల్ వాటా 32.6 శాతానికి పరిమితమైంది. వెరసి కంపెనీలో సంయుక్త ప్రమోటర్ల వాటా 87.6 శాతం నుంచి 85.6 శాతానికి తగ్గింది. ఈ వాటా కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. న్యూఢిల్లీ: బిల్డింగ్ మెటీరియల్స్ కంపెనీ వెల్‌స్పన్ కార్ప్‌లో ప్రమోటర్లు 2.39 శాతం వాటా విక్రయించారు. ఎన్ఎస్ఈ బ్లాక్ డీల్స్ వివరాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 63 లక్షల షేర్లను(2.39 శాతం వాటా) విక్రయించారు. ఒక్కో షేరుకీ రూ. 2,437.3 సగటు ధరలో చేపట్టిన విక్రయం ద్వారా రూ. 1,433 కోట్లకుపైగా అందుకున్నారు.

# అవును పెళ్లయ్యింది. నలుగురు పిల్లలు

విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై  కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు.





# ఆసుపత్రి పాలైన అవికా గోర్..

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.


# సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద విషాదం..



బాలీవుడ్ అగ్రకథనాయకుడు సల్మాన్ ఖాన్ నివాసమైన ముంబై బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సల్మాన్ ఖాన్ భద్రత కోసం అక్కడ విధుల్లో ఉన్న 41 ఏళ్ల ముంబై పోలీసు కానిస్టేబుల్ గణేష్ రైతే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ముంబై పోలీసు విభాగంలోని ఎల్‌ఏ-4 యూనిట్‌కు చెందిన గణేష్ రైతే, శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గెలాక్సీ అపార్ట్‌మెంట్ వెలుపల పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన అశాంతి, ఛాతిలో అసౌకర్యంగా ఉన్నట్లు తోటి సిబ్బందికి తెలిపారు. క్షణాల వ్యవధిలోనే ఆయన ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన తోటి పోలీసులు వెంటనే ఆయన్ను సమీపంలోని భాభా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేసరికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతికి గల అసలు కారణాన్ని నిర్ధారించడానికి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా, గణేష్ రైతే గతంలో భారతీయ సైన్యంలో దేశ సరిహద్దులను కాపాడటంలో సేవలు అందించారు. ఆర్మీ సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ముంబై పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులలో, తోటి పోలీసు సిబ్బందిలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి తరచూ వస్తున్న బెదిరింపుల కారణంగా సల్మాన్ ఖాన్‌కు ప్రస్తుతం కట్టుదిట్టమైన వై-ప్లస్(-జూశ్రీబం) భద్రత కల్పించిన విషయం తెలిసిందే. ఈ భద్రతా వలయంలో భాగంగానే నిత్యం సల్మాన్ నివాసం వెలుపల పోలీసుల పహారా కొనసాగుతోంది. ఈ భద్రతా ఇబ్బందులపై గతంలో స్పందించిన సల్మాన్ ఖాన్, తనకు దేవుడిపై నమ్మకం ఉందని, ఎంత ఆయుష్షు ఉంటే అంత బతుకుతామని, చుట్టూ రక్షణ సిబ్బందితో తిరగడం ఒక్కోసారి కష్టంగా ఉంటుందని పేర్కొన్న సంగతి తెలిసిందే.

# రవితేజ కొత్త చిత్రం

'ఇరుముడి' అద్భుత విజయంతో రవితేజ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఉన్నారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ విజయానందంలో రవితేజ వరుస సినిమాలకు సిద్ధమవుతున్నారు. హసిత్‌గోలి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. దిల్‌రాజు నిర్మించే ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది. తాజాగా రవితేజ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'సరిపోదా శనివారం' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న దర్శకుడు వివేక్ ఆత్రేయతో రవితేజ సినిమా చేయబోతున్నారు. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై లక్ష్మణ్, శ్రీని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ తనదైన శైలి వినూత్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, త్వరలో మరిన్ని వివరాలు తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు. రవితేజ-హసిత్‌గోలి కాంబినేషన్ సినిమా పూర్తయిన తర్వాతే ఈ కొత్త ప్రాజెక్ట్ సెట్స్‌మీదకు వెళ్లనుంది.



# నాని-సుజీత్ 'బ్లడీ రోమియో'లో హీరోయిన్‌గా లెనిన్ బ్యూటీ..

మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్?

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సెన్సేషనల్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటించనున్నారు. ఇప్పటికే 'ఓజీ'తో తన మార్క్ చూపించిన సుజీత్ దర్శకత్వంలో నాని హీరోగా నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనుంది. ఇప్పటివరకు ఈ సినిమాలో నాని సరసన ఎవరు హీరోయిన్‌గా నటించనున్నారనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం యంగ్ అండ్ గ్లామరస్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేను ఈ ప్రాజెక్ట్ కోసం సంప్రదించినట్లు తెలుస్తోంది. దర్శకుడు సుజీత్, నిర్మాతలు ఇప్పటికే భాగ్యశ్రీతో చర్చలు జరిపినట్లు, కథతో పాటు తన పాత్ర నచ్చడంతో ఆమె కూడా ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే.. మాస్ మహారాజా రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే తన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ నటించిన 'కింగ్డమ్', రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలుకా' వంటి చిత్రాల్లో నటించి తన పరిధిని పెంచుకున్నారు.ఇక అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' సినిమాతో భాగ్యశ్రీ బోర్సేకు మరింత క్రేజ్ వచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, సినిమా విజయం ఆమెకు వరుస అవకాశాలు తెచ్చిపెడుతోంది. ఒకవైపు వరుస విజయాలతో నాని మంచి ఫామ్‌లో ఉండగా.. మరోవైపు 'ఓజీ'తో సుజీత్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఇద్దరి కలయికలో 'బ్లడీ రోమియో' తెరకెక్కనుండటంతో సినిమాపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారన్న వార్త నిజమైతే నాని--భాగ్యశ్రీ జోడీకి ఇదొక కొత్త కాంబినేషన్ కానుంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్, ఎమోషన్, స్టైలిష్ టేకింగ్‌తో సుజీత్ ఈ సినిమాను ఏ స్థాయిలో తెరకెక్కిస్తారో చూడాలి.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com